సాక్షి తిరుపతి

గురువారం । 9 । అక్టోబర్ । 2025



వాణిజ్యాభివృద్ధి దిశగా..

తిరుపతి రైల్వేస్టేషన్‌ను వాణిజ్యాభివృద్ధి దిశగా తీసుకెళుతున్నట్లు రైల్ ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు తెలిపారు. - 8లో



ఇసుక టిప్పర్ల పట్టివేత

సత్యవేడు సమీపంలోని ఎన్ఎస్ కండ్రిగ క్రాస్ వద్ద ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను పోలీసులు సీజ్ చేశారు. - 8లో



వెటర్నరీలో జాతీయ సదస్సు

తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీలో పశుపక్ష్యాదులకు వైద్యసేవలపై జాతీయ సదస్సును ప్రారంభించారు. - 8లో

న్యూస్‌రీల్

ఆంక్షలతో కట్టడి అసాధ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

చిల్లకూరు : వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆంక్షలతో కట్టడి చేయడం అసాధ్యమని, కూటమి ప్రభుత్వం అడ్డంకులు సృష్టించినప్పటికీ ప్రజాభిమానం పోటెత్తుతుందని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ స్పష్టం చేశారు. బుధవారం గూడూరులోని పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ జగనన్న క్షేత్రస్థాయిలో పర్యటిస్తారని అంటేనే ప్రభుత్వం భయపడుతోందన్నారు. పోలీసుల ద్వారా అడ్డుకునేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. ప్రజా నాయకుడి పర్యటనకు ఆంక్షలు విధించడం దారుణమని మండిపడ్డారు. గూడూరు నియోజకవర్గంలో అనుబంధ కమిటీల ద్వారా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కసరత్తు చేస్తున్నామని వెల్లడించారు. అందులో భాగంగానే ఇప్పటి వరకు నియోజకవర్గస్థాయి, మండలస్థాయి కమిటీల నియామకాలను పూర్తి చేసినట్లు వివరించారు. సమావేశంలో పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు బొమ్మిడి శ్రీనివాసులు, పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, సన్నారెడ్డి శ్రీనివాసుల రెడ్డి, మేధావుల ఫోరమ్ కన్వీనర్ నందవరం సుబ్బారావు పాల్గొన్నారు.

పారదర్శకంగా వైద్యసేవలు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : ఆస్పత్రుల్లో రోగులకు పారదర్శకంగా వైద్యసేవలు అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులపై జిల్లా స్థాయి క్రమశిక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా సమన్వయ అధికారి రాజశేఖర్ రెడ్డితో కలసి కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు బాధ్యతతోపాటు సేవా భావంతో పనిచేయాలని కోరారు. ప్రభుత్వాసపత్రి వైద్యులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. ప్రైవేటు హాస్పిటళ్ల డాక్టర్లు సైతం అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద ప్రజల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా మేనేజర్ శివ కుమార్, టీమ్ లీడర్లు సంకల్ప హాస్పిటల్ ఎండీ డాక్టర్ అనంత నాగ్, సాయి సుధా హాస్పిటల్ ఎండీ డాక్టర్ సుకుమార్, ఎంఎస్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ శ్రీధర్, రమాదేవి హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్, ఎస్వీ ఆర్ఆర్‌జీ జీహెచ్ నుంచి డాక్టర్ గోపి పాల్గొన్నారు.

టెస్టుల టెన్షన్!

పింఛన్ల తొలగింపుతో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దివ్యాంగులు (ఫైల్)



మంచం పట్టిన వారు.. కదలలేని వారు.. నడవలేని వారు.. కనపడనివారు.. వినపడనివారు.. శరీర అవయవాలు సక్రమంగా లేని వారు.. మానసిక వైకల్యంతో బాధపడేవారు.. దీర్ఘకాలికంగా వ్యాధిగ్రస్తమైనవారు.. ఇల్లు దాటేందుకు సైతం మరొకరిపై ఆధారపడుతూ అవస్థలు పడేవారు.. అందరినీ కూటమి ప్రభుత్వం వేధిస్తోంది. దయనీయ స్థితిలో జీవనం సాగిస్తున్నారనే కనికరం కూడా లేకుండా నోటి కాడ కూడు లాగేస్తోంది. వికలత్వంపై వైద్య పరీక్షల పేరుతో మళ్లీ ఇబ్బంది పెడుతోంది. గతంలో పరిశీలించిన డాక్టర్లనే నియమించి కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది. టెస్టులకు రాకుంటే పింఛన్ తొలగిస్తామని భయాందోళనకు గురి చేస్తోంది. కక్షగట్టినట్టు అన్యాయంగా అభాగ్యులను సాధిస్తోంది.

జిల్లాలో దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఇక్కట్లు

- వైకల్య నిర్ధారణకు పునరావృతమైన తిప్పలు
- గతంలో పరిశీలించిన వైద్యులతోనే మళ్లీ పరీక్షలు
- తొలిరోజు ఓపెన్ కాని సెర్ప్ వెబ్‌సైట్
- 6,967 మందికి తప్పని పడిగాపులు

తిరుపతి అర్బన్ : కూటమి ప్రభుత్వ వైఖరితో దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పింఛన్ టెన్షన్ తప్పడం లేదు. ఆగస్టు మూడో వారంలో జిల్లాలోని 6967 మందికి పెన్షన్ తొలగిస్తున్నట్లు సచివాలయ ఉద్యోగులు చేతుల మీదుగా నోటీసులు అందించారు. దీంతో అవాక్కైన లబ్ధిదారులు ప్రభుత్వంపై పోరాటానికి దిగారు. కలెక్టరేట్ ఎదుట ధర్నాలు, నిరసనలు చేపట్టారు. దీంతో సర్కారు దిగివచ్చి సెప్టెంబర్, అక్టోబర్‌లో కోత లేకుండా పింఛన్ అందించింది. అయితే మరోసారి వికలత్వం పరీక్షలు చేపట్టడానికి నోటీసులు జారీ చేసింది.ఇందుకోసం తిరుపతి రుయా ఆస్పత్రి, శ్రీకాళహస్తి, గూడూరు ఏరియా హాస్పిటళ్లను మాత్రమే ఎంపిక చేసింది. ఒక్కో ఆస్పత్రిలో రోజుకు 100 మందికి మాత్రమే పరీక్షలు చేయనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు మూడు ఆస్పత్రుల్లో రోజుకు 300 మందికి పరీక్షలు చేయాల్సి ఉంది. సెలవులు పక్కనపెడితే నెల పాటు జిల్లాలోని ఈ మూడు ఆస్పత్రిలో 6,967 మందికి పరీక్షలు పూర్తి చేయాలి.

మళ్లీ పాత డాక్టర్లే..

గతంలో పరీక్షించిన వైద్యులు తమ వికలత్వాన్ని తగ్గించి రిపోర్ట్ ఇచ్చారని దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులు ఆరోపిస్తున్నారు. అందువల్లే తమ పింఛన్ పోవడంతోపాటు దివ్యాంగుల కోటాకు చెందిన రిజర్వేషన్ సైతం దూరమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పుడు నివేదికలు ఇచ్చిన వైద్యులను సస్పెండ్ చేయాలని అప్పట్లో భారీగా డిమాండ్లు సైతం వెల్లువెత్తాయి. ఈ పర్యాయం కూడా మళ్లీ అదే డాక్టర్లుకు పరీక్షల తనిఖీల బాధ్యతలు అప్పగించడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో వారు ఇచ్చిన వికలత్వం తప్పుగా ఉందని రిపోర్ట్‌ను మళ్లీ వాళ్లే ఇస్తారా అంటూ పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



కంటి పరీక్ష నిర్వహిస్తున్న డాక్టర్

మొరాయించిన వెబ్‌సైట్

దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులకు ఆస్పత్రిలో వైద్య పరీక్షలకు సంబంధించి సచివాలయ ఉద్యోగులు తొలిరోజు ఆలస్యంగా నోటీసులు జారీ చేశారు. దీంతో వారంతా ఆలస్యంగానే ఆస్పత్రికి వెళ్లారు. పరీక్షలు అయితే చేశారు. అయితే వికలత్వం శాతం, ఇతర వివరాలను సెర్ప్ వెబ్‌సైట్‌లో ఫీడింగ్(నమోదు) చేయాల్సి ఉంది. అయితే తొలి రోజు వెబ్‌సైట్ ఓపెన్ కాలేదు. దీంతో ఏపీ ఆన్‌లైన్ బయో మెట్రిక్ ఇబ్బందులు తప్పలేదు. దరఖాస్తులతోపాటు కొత్త రిపోర్ట్ తమవద్దే ఉందని తర్వాత చేస్తామని వైద్య సిబ్బంది వెల్లడించారు. దీంతో పరీక్ష చేయించుకున్న వారు ఆందోళన చెందుతున్నారు. గతంలో మాదిరిగా మళ్లీ తప్పుల తడకగా తమ వికలత్వాన్ని నమోదు చేస్తారేమో అని టెన్షన్ పడుతున్నారు.

వైద్య ఖర్చులకే..



గతంలో మా పింఛన్లు తొలగిస్తూ నోటీసులు ఇవ్వడంతో దిక్కుతోచ లేదు. న్యాయ పోరాటం చేసేందుకే కాదు, కనీసం కలెక్టరేట్‌కు రావడానికి ఆరోగ్యం సహకరించక పలువురు తిప్పలు పడ్డారు. మళ్లీ అలాంటి పరిస్థితి తీసుకువస్తే సహించలేం, దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులను వేధించడం సరికాదు. పింఛన్లు తొలగించడమే కాదు, రూ.15 వేలు వచ్చే వారికి రూ.6వేలు చేయడం కూడా మంచికాదు. పెన్షన్ నగదును కేవలం వైద్యఖర్చులకే వాడుకుంటున్నాం.

– మురళీగౌడ్, దివ్యాంగుల సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు

పారదర్శకంగా చేపట్టాలి



దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులకు సంబంధించి మరోసారి వైద్యులు చేపడుతున్న పరీక్షలు పారదర్శకంగా చేపట్టాలి. అర్హులైన అందరిరీ న్యాయం చేయాలి. అడ్డదిడ్డంగా వికలత్వం సర్టిఫికెట్లు ఇస్తాం అంటే ఊరుకోం. అర్హులకు అన్యాయం చేస్తే..మళ్లీ రోడెక్కి పోరాటం చేస్తాం. లబ్ధిదారులకు రాజకీయరంగు పులమకుండా న్యాయంగా వ్యవహరించాలి.

– చంద్రశేఖర్, దివ్యాంగుల జేఏసీ స్టేట్ ప్రెసిడెంట్

అన్యాయం చేస్తే సహించం



దివ్యాంగులే కదా ఏం చేస్తారులే అని నిర్లక్ష్యంగా వ్యవహరించి అన్యాయం చేస్తే సహించే ప్రసక్తే లేదు. ఈ సారి రాష్ట్ర స్థాయిలో రోడెక్కడం ఖాయం. కావాలనే వికలత్వాన్ని తగ్గించిన వారు తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందే. ఇప్పటికే దివ్యాంగులకు అన్యాయం చేస్తోందని కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చింది. మళ్లీ అదే పరిస్థితి తెచ్చుకోకూడదని కోరుతున్నాం. న్యాయంగా వ్యవహరిస్తే మాకు ఎటువంటి అభ్యంతరం లేదు.

– అరగొండ సుమతి, దివ్యాంగుల జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు

జాలి చూపండి



వైకల్యంతో మా పనులు మేము చేసుకోవడానికి కూడా నానా ఇబ్బందులు పడుతున్నాం. మరోవైపు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నాం. పింఛన్ డబ్బులతోనే 100శాతం మంది వైద్యం చేయించుకుంటున్నారు. పలు కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులతో దివ్యాంగులను చూసేవాళ్లు కూడా ఉండడం లేదు. ఈ అంశాలను వైద్యులు తప్పకుండా పరిగణలోకి తీసుకుని వికలత్వం సర్టిఫికెట్ ఇవ్వాలని కోరుతున్నాం. దివ్యాంగులపై కక్షపూరితంగా కాకుండా, కాస్త జాలి చూపండి.

–మురళి, దివ్యాంగుల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

సమర్థ పాలనతోనే దేశాభివృద్ధి



ఐఐటీ విద్యార్థులతో జయప్రకాష్ నారాయణ

ఏర్పేడు : సమర్థవంతమైన పాలనతోనే దేశాభివృద్ధి సుస్థిరంగా సాగుతుందని లోకసత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ స్పష్టం చేశారు. బుధవారం ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో 'ఇండియా రోడ్ అహెడ్ అనే అంశంపై ఆయన మాట్లాడారు. క్రమశిక్షణ, చట్ట పాలన, విద్య, ఆరోగ్య సంరక్షణ, మౌలిక సదుపాయాలు వంటి సామూహిక అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వాలు ఎందుకు అవసరమో వివరించారు. దేశంలో ప్రజాస్వామ్య విధానం, ఆర్థిక పరిణామం, సాంకేతిక విప్లవం కోసం నూతన ఆవిష్కరణల ఆవశ్యతకను విశదీకరించారు. సుస్థిర, సమ్మిళిత వృద్ధి సమాన అభివృద్ధిని నిర్ధారించేందుకు సమాజంలోని వివిధ వర్గాల మధ్య అంతరం తగ్గించేందుకు ఆవిష్కరణలు ఉపయోగపడతాయన్నారు. విద్య, వైద్యం వ్యవసాయం, పరిశ్రమ వంటి రంగాలే ప్రధాన ఆర్థిక వ్యవస్థలని వెల్లడించారు. అనంతరం ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ తిరుపతి ఐఐటీ సాధించిన విజయాలను వివరించారు.

మాతృమరణాల నివారణే లక్ష్యం

తిరుపతి అర్బన్: మాతృమరణాల నివారణే లక్ష్యంగా పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్యాధికారులతో మాతృమరణాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణీల్లో హైరిస్క్ ప్రెగ్నెన్సీగా ముందుగానే గుర్తించి, వారికి అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు, సహకారాలు సమయానికి అందించాలని కోరారు. చెన్నూరు, చిల్లకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఇటీవల జరిగిన మాతృ మరణాలపై మండిపడ్డారు. ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. అలాగే గూడూరు సీఆర్‌రెడ్డి ఆస్పత్రిలో మాతృమరణంపై మాట్లాడుతూ వారికి రూ.3 లక్షలు జరిమానా విధించాలని ఆదేశించారు. డీఎంహెచ్ఓ బాలకృష్ణనాయక్, డాక్టర్లు శాంతకుమారి, శైలజ, పద్మ, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యం.. కూటమికి నైవేద్యం



తిరుపతిలోని ఎక్సైజ్ కార్యాలయం ఎదుట బైఠాయించిన వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేతలు

- రాష్ట్రంలో విచ్చలవిడిగా లిక్కర్ దందా
- ప్రభుత్వ తీరుపై వైఎస్సార్‌సీపీ మహిళల ఆగ్రహం
- ఎక్సైజ్‌శాఖ కార్యాలయం వద్ద ధర్నా

తిరుపతి మంగళం : రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నేతలు కాసుల కక్కుర్తితో కల్తీ మద్యం తయారు చేసి విక్రయిస్తున్నారని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు గీతాయాదవ్, తిరుపతి నగర బూత్ కమిటీ ఇన్‌చార్జి ఉప్పాల సాయికుమారి మండిపడ్డారు. బుధవారం ఈ మేరకు తిరుపతిలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద మహిళలతో కలిసి ధర్నా నిర్వహించారు. మద్యం సీసాలను పగులగొట్టి నిరసన తెలిపారు. కల్తీ మద్యం అరికట్టాలి, బెల్ట్ షాపులను తొలగించాలి, నకిలీ లిక్కర్ తయారుచేస్తున్న టీడీపీ, జనసేన నేతలపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందన్నారు. టీడీపీ నేతలే విచ్చలవిడిగా కల్తీ మద్యం తయారు చేసి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. చంద్రబాబుకు దోచుకోవడం, దాచుకోవడం తప్ప నకిలీ లిక్కర్ కారణంగా మహిళల పుస్తెలు తెగిపోతున్నా పట్టదని ఆరోపించారు. ఈ ఏడాదిన్నరలోనే కల్తీ మద్యం తాగి వేలాదిమంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా లిక్కర్ దందాను నిలిపివేయకుంటే ఇదే మద్యం ఒంటిపై పోసుకుని ఆత్మాహుతి చేసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో మద్యం విక్రయాలను అరికడతాం, మహిళల మానప్రాణాలకు అండగా ఉంటామని ఊదరగొట్టిన పవన్‌కల్యాణ్‌కు ఇప్పుడు కల్తీ లిక్కర్ కనిపించం లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుణీత, పార్టీ నేతలు నైనారు మధుబాల, విజయలక్ష్మీ రాయల్, పద్మజ, పుష్పలత, మహిత, రాజేశ్వరి, రాధ, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



మద్యం సీసాలను పగులగొట్టి నినాదాలు..

సర్కారుకు షాక్ తప్పదు



ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతున్న జేఏసీ నేతలు



ఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

తిరుపతిలో రోడ్డెక్కిన విద్యుత్ ఉద్యోగులు

- ఏపీ ఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట మహాధర్నా
- ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని మండిపాటు
- 13న చలో విజయవాడకు పిలుపు
- 15 తర్వాత సమ్మెకు దిగుతామని హెచ్చరిక

తిరుపతి రూరల్ : విద్యుత్ శాఖలో సమస్యల పరిష్కారం కోసం వేలాది మంది విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, ట్రాన్స్‌కో, జెన్‌కో ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు రోడ్డెక్కారు. బుధవారం తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట మహా ధర్నా చేపట్టారు. తిరుపతి డిస్కం పరిధిలోని ఐదు జిల్లాల నుంచి వచ్చిన ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు కూటమి ప్రభుత్వ వైఖరిపై మండిపడ్డారు. విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఎంప్లాయాస్ సంఘాల సమాఖ్య (జేఏసీ) తిరుపతి డిస్కమ్ చైర్మన్ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ పీఆర్‌సీ, డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని, ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. జేఏల్ఎం గ్రేడ్-2 కింద నియమితులైన కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా పరిగణించాలన్నారు. డిస్కమ్ కో-చైర్మన్ నాగరాజు మాట్లాడుతూ యాజమాన్యం అనుసరించే అశాస్త్రీయ విధానాల కారణంగా విద్యుత్ సంస్థలకు నష్టం వస్తోందని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి యాజమాన్యాలు తప్పుడు నివేదికలు ఇవ్వడం వల్లే ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. డిస్కమ్ కన్వీనర్ మురళీధర్ మాట్లాడుతూ సంస్థలో పనిచేస్తూ దూరవిద్య కళాశాలల్లో ఉన్నత చదువులు చదివి అర్హత సాధించిన వారికి ఉద్యోగోన్నతులు కల్పించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. వెల్లడించారు. డిస్కమ్ వైస్ చైర్మన్ జయరాం మాట్లాడుతూ ఉద్యోగులపై యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించడం నిరంకుశ ధోరణికి నిదర్శనమన్నారు. డిస్కమ్ వైస్ చైర్మన్ జయమణి మాట్లాడుతూ జేఏల్ఎం గ్రేడ్ 2 కార్మికులను రెగ్యులర్ చేయడంతో పాటు వారికి విధించిన కొత్త సర్వీసు రెగ్యులేషన్స్‌ను రద్దు చేసి శాశ్వత ఉద్యోగులతో సమానంగా సర్వీసు రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతి సర్కిల్ జేఏసీ చైర్మన్ వెలకటూరి గోపి మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, రెగ్యులర్ ఉద్యోగస్తులతో పాటు వివిధ హోదాల్లో పనిచేసి రిటైర్డ్ అయిన వారికి అపరిమిత వైద్య సౌకర్యం కల్పించాలని కోరారు. విద్యుత్ ఉప కేంద్రాల్లో పనిచేసే కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

మోసానికి నిరసనగానే..

కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ఉద్యోగులను మోసం చేసినందుకు నిరసనగానే ఈనెల 13న చలో విజయవాడ చేపడుతున్నట్లు జేఏసీ నేతలు తెలిపారు. ప్రభుత్వంపై పోరాటానికి ఉద్యోగులు పెద్దసంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అప్పటి కూడా ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు స్పందించకుంటే ఈనెల 15 తర్వాత నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు ఎల్.చలపతి, వై.వెంకట సునీల్, వి.సతీష్, టి.రవికుమార్, సురేష్,రియాజ్ అహ్మద్, రామలింగారెడ్డి, సంజీవరావు, కృష్ణయ్య , తిరుపాల్ రెడ్డి ,రంగయ్య ,హుస్సేనయ్య , శంకర్, బాలకాశి, నాగార్జున, సుధాకర్, ఏలుమలై పాల్గొన్నారు.

ఎస్వీయూ వీసీగా నర్సింగరావు



తిరుపతి సిటీ : ఎస్వీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ టాటా నర్సింగరావును నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రొఫెసర్ నర్సింగరావు బెనారస్ వర్సిటీలో పీజీ పూర్తి చేసి పలు ఐఐటీ కళాశాలల్లో అధ్యాపకుడిగా విధులు నిర్వర్తించారు. మంత్రి లోకేష్ వ్యక్తిగా గుర్తింపు పొందిన ఆయన ఎస్వీయూ వీసీగా నియమితులయ్యే అవకాశముందని రెండు నెలల ముందే సాక్షి పత్రిక పసిగట్టింది. ఈ మేరకు కథనాలు ప్రచురించడం గమనార్హం. శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీని తమ ఆధీనంలో ఉంచుకోవడం కోసమే మంత్రి లోకేష్ తనకు అనుకూలంగా వ్యవహరించే వ్యక్తికి వైస్ చాన్సలర్ పదవిని కట్టబెట్టినట్లు జిల్లాలో విస్తృతంగా చర్చసాగుతోంది.

ఎస్వీయూలో కాగ్ నివేదికపై సమీక్ష


మాట్లాడుతున్న పబ్లిక్ అకౌంట్స్ కమిటీ అధ్యక్షుడు రామాంజనేయులు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో కాగ్ నివేదికపై ఏపీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమీక్షించింది. బుధవారం వర్సిటీ పరిపాలనా భవనంలోని సెనేట్ హాల్‌లో ఎస్వీయూ అధికారులతో అకౌంట్స్ కమిటీ సమావేశమైంది. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ అధ్యక్షుడు పి.రామాంజనేయులు ఆధ్వర్యంలో వర్సిటీలోని పరిణామాలపై పూర్తి స్థాయిలో చర్చించింది. ప్రధానంగా మొత్తం 24 అంశాలతో కూడిన నివేదికను విశ్లేషించింది. ఉద్యోగ, ఉపాధి, నైపుణ్యాభివృద్ధిని మెరుగు పరిచే ఉద్యోగ మేళాలు, నూతన విద్యా విధానం–2020 అమలు, కొత్త యూజీ కోర్సుల్లో ప్రవేశానికి అవకాశాలు కల్పించడం, విద్యార్థుల ఫీల్డ్ ప్రాజెక్టులపై దృష్టి, నాణ్యమైన బోధనా సిబ్బంది నియామకంపై ఆరా తీసింది. విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లో మౌలిక సదుపాయాల, పరీక్ష ఫలితాల జాప్యం, అనుబంధ కళాశాలల్లో ఐక్యూఏసీ , ఆట స్థలాలు, ప్రయోగశాలల ఏర్పాటు, వర్సిటీకి వచ్చిన నిధుల వినియోగం, రూసా 2.0 ప్రకారం మౌలిక వసతుల కల్పనలో ప్రగతి వంటి విషయాలను సుదీర్ఘంగా చర్చించింది. ఈసందర్భంగా వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు వర్సిటీలో చేపట్టిన అభివృద్ధి పనులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు ఆనందబాబు, రాధాకృష్ణ, అశోక్ కుమార్ రెడ్డి, జయనాగేశ్వర రెడ్డి, లలిత కుమారి, శ్రీరామ్ రాజగోపాల్, విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు.

పడకేసిన పల్లెలు!



తిరుపతి జిల్లాలో పల్లెవాసులు వైద్యసేవలందక ఇబ్బంది పడుతున్నారు. పర్యవేక్షణ కరువై విలేజ్ హెల్త్ క్లినిక్‌లు సక్రమంగా పనిచేయకపోవడంతో సకాలంలో చికిత్సలందక కొట్టుమిట్టాడుతున్నారు. దీనికితోడు పీహెచ్‌సీ వైద్యులు సమ్మెబాట పట్టారు. ఈక్రమంలోనే 104 సేవలు సైతం అందుబాటులో లేక గ్రామీణులు సతమతమవుతున్నారు. ఇదే అదునుగా అరకొరగా ఉన్న సిబ్బంది సైతం సమయపాలన పాటించకపోవడంతో రోగం వస్తే పట్టించుకునే నాథుడే కరువయ్యారు. వర్షాకాలం నేపథ్యంలో చుట్టుముట్టిన సీజనల్ వ్యాధులతో తల్లడిల్లుతున్నారు. నాణ్యమైన వైద్యం అందక విలవిలలాడుతున్నారు.

- జిల్లాలో పనిచేయని విలేజ్ హెల్త్ క్లినిక్‌లు
- సమయపాలన పాటించని ఉద్యోగులు
- సమ్మె బాట పట్టిన పీహెచ్‌సీ వైద్యులు
- ఆగిన 104 సేవలు
- వర్షాకాలం నేపథ్యంలో విజృంభిస్తున్న వ్యాధులు
- సతమతమవుతున్న గ్రామీణులు

కుంటుపడిన సేవలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్య సేవలు కుంటుపడ్డాయి. పల్లె వైద్యం పూర్తిగా పడకేసింది. పీహెచ్‌సీల్లో వైద్యం ఆమడదూరంలో నిలిచిపోయింది. మందులు, మాత్రలు కరువయ్యాయి. వైద్యులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. ప్రస్తుతం పీహెచ్‌సీ వైద్యులు సమ్మె బాట పట్టారు. దీంతో పీహెచ్‌సీల్లో వైద్యం చేసేవారు లేక వెలవెలబోతున్నాయి. ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజల సంఖ్య కూడా పూర్తిగా తగ్గిపోయింది. ఈ క్రమంలోనే ఆర్‌ఎంపీలు, ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించేవారు పెరిగిపోయారు. ఇదే అదునుగా పీహెచ్‌సీ సిబ్బంది సైతం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తూతూమంత్రంగా వచ్చి వెళ్లిపోతున్నారు. సమ్మె ప్రభావంతో 104 సేవలు సైతం స్తంభించాయి.

కాణిపాకం : తిరుపతి జిల్లాలో 58 పీహెచ్‌సీలు, 460పైగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లున్నాయి. వీటిలో 100 మందికిపైగా వైద్యులు, 450 మంది వరకు మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు పనిచేస్తున్నారు. అలాగే ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు సైతం క్లినిక్‌లే కేంద్రంగా సేవలందిస్తున్నారు. గతంలో విలేజ్ క్లినిక్‌లు, ఆరోగ్య కేంద్రాలకు వేలాది సంఖ్యలో ఓపీలొచ్చేవి. వైద్య సలహాలు తీసుకునేందుకు వేలసంఖ్యలో జనం క్యూ కట్టేవారు. అలాగే క్రమం తప్పకుండా మందులు, మాత్రలు తీసుకునేందుకు బారులుతీరేవారు. ఫ్యామిలీ ఫిజిషియన్ ద్వారా మెరుగైన వైద్య సేవలను పొందేవారు. ఇటీవల ఈ సేవలు పల్లెప్రజలకు దూరమయ్యాయి.


పీహెచ్‌సీలో ఖాళీగా వైద్యుడి కుర్చీ

ఫిర్యాదుల వెల్లువ

విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో సిబ్బంది సమయపాలనపై అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. 20రోజుల క్రితం డీఎంహెచ్‌ఓ ఓ ప్రకటన విడుదల చేశారు. అందరూ విధిగా ఉదయం 9గంటలకే క్లినిక్‌లను తెరవాలని ఆదేశించారు. కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు వెళ్లిందని అందులో పేర్కొన్నారు. అయినప్పటికీ చాలా మంది మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు తమ ఇష్టానుసారంగానే వ్యవహరిస్తున్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య సేవలను పల్లె ముంగింటకే తీసుకొచ్చింది. వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ పేరుతో ప్రజారోగ్య రక్షణకు పెద్దపీట వేసింది. క్లినిక్‌లలో మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లను నియమించింది. 150 రకాల మందులు, మాత్రలను అందుబాటులో ఉంచింది. 14 రకాల పరీక్షలు అక్కడే చేసేలా చర్యలు తీసుకుంది. కేంద్రం ద్వారా ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వర్తిస్తూ వచ్చింది. టెలీమెడిసన్ విధానం ద్వారా వైద్య సేవలను సులభతరం చేసింది. ఈ సేవలను నిత్యం పర్యవేక్షిస్తూ..లోపాలను ఎప్పటికప్పుడు సరిదిద్దేలా చర్యలు చేపట్టింది. పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్ల విధానం తీసుకువచ్చింది. ఫేషియల్ అటెండెన్స్‌ను తీసుకొచ్చి సేవలను పారదర్శకంగా అమలు చేసింది. పల్లె జనానికి ఆరోగ్య భరోసాను కల్పించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉన్న వైద్య సేవలను నీరుగారుస్తోందని గ్రామీణులు విమర్శలు గుప్పిస్తుండడం గమనార్హం.

పెయిన్ కిల్లర్స్‌తో కిడ్నీలకు ముప్పు

- పాళెంపాడులో పర్యటించిన స్విమ్స్ వైద్యులు

సాక్షి ఎఫెక్ట్..


బాధితురాలి మెడికల్ రిపోర్టులను పరిశీలిస్తున్న వైద్యులు

దొరవారిసత్రం: మండలంలోని పాళెంపాడులో బుధవారం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తిరుపతి స్విమ్స్ ఆస్పత్రి వైద్యులు పర్యటించారు. నెఫ్రాలజిస్ట్ రవికుమార్, పాథాలజిస్ట్ మల్లికార్జున్, జనరల్ మెడిసిన్ రమేష్ క్షేత్రస్థాయిలో బాధితులతో మాట్లాడారు. వారి మెడికల్ రిపోర్టులు పరిశీలించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తుల్లో పలువురు కొన్నేళ్ల నుంచి అధిక మోతాదులో పెయిన్ కిల్లర్స్ వాడినట్లు గుర్తించారు. అందుకే క్రియాటిన్ లెవెల్స్ పెరిగి కిడ్నీలు దెబ్బతిన్నట్లు బృందం సభ్యులు వెల్లడించారు. మరి కొందరికి 60 ఏళ్లు దాటడంతో వయసు రీత్యా కిడ్నీ సంబంధిత వ్యాధులు వచ్చినట్లు వివరించారు. పాళెంపాడు గ్రామంలో ఇప్పటి వరకు 25 మంది కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలిసిందే. వీరిలో వైద్య బృందం 16మందిని కలిసి మాట్లాడింది. ఆరుగురికి మరో సారి కిడ్నీ సంబంధిత వైద్య పరీక్షలను స్విమ్స్‌లో చేయించాలని నిర్ణయించింది. గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకు నీళ్లు, చేతి బోర్లు నీటిని తాగడం వల్ల ఎముల సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశముందని, కిడ్నీ సంబంధిత వ్యాధులు వచ్చే ఛాన్స్ లేదని నీటి పరీక్షల్లో తేలినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరంలోని సిబ్బందితో మాట్లాడి రోగుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్యం అందించే విధివిధానాలపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ వీరకుమార్, పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, అరుణరుత్విక్, సూర్యకిరణ్ పాల్గొన్నారు.

చెవిరెడ్డి కోసం పూజలు


ఆలయంలో వైఎస్సార్‌సీపీ నేతలు

తిరుపతి రూరల్ : కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి విడుదల కావాలని కోరుతూ బుధవారం విజయవాడ కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేతలు విడుదల మాధవ రెడ్డి, మునీశ్వర్ రెడ్డి, భానుకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వంచనకు కేరాఫ్ చంద్రబాబు


మీడియాతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్ : వంచనకు కేరాఫ్ చంద్రబాబు అని, ఇచ్చిన హామీలను తుంగలో తొక్కడం, ప్రజలను మోసం చేయడం ఆయన నైజమని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలోని నేదురుమల్లి నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. 18 ఏళ్లు నిండిన మహిళలకు స్త్రీనిధి కింద ప్రతి నెలా రూ.1,500 ఇస్తామని ఇప్పటి వరకు ఒక్కసారి కూడా జమ చేయలేదని విమర్శించారు. అలాగే నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తామని యువతను మోసం చేశారని ఆరోపించారు. విద్యావ్యవస్థను మంత్రి లోకేష్ పూర్తిగా భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు ఈ క్రమంలోనే స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు వెనకడుగు వేస్తున్నారని స్పష్టం చేశారు.

జగన్ 2.0 ఓ వరం

వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలకు భరోసా కల్పించే దిశగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన జగన్ 2.0 ఒక వరమని నేదురుమల్లి తెలిపారు. అందులో భాగంగానే రాష్ట్ర స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు పార్టీలో కార్యకర్తలకు పదవులు కేటాయించారని వెల్లడించారు. వెంకటగిరి నియోజకవర్గానికి ఎస్‌ఈసీ (స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్) సభ్యులుగా ముగ్గురికి అవకాశం కల్పించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఎస్‌ఈసీ మెంబర్ బొలిగర్ల మస్తాన్‌యాదవ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని స్పష్టం చేశబూరు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ మాజీ చైర్మన్ నక్కా వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, మున్సిపల్ విప్ పూజారి లక్ష్మి, వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య, కౌన్సిలర్లు ధనియాల రాధ, కందాటి కల్యాణి, ఎంఏ నారాయణ, ఆరి శంకరయ్య, నేతలు ఎం.వెంకటేశ్వర్లు, మస్తాన్‌రెడ్డి, కందాటి రాజారెడ్డి, పూజారి శ్రీనివాసులు, కల్లు సతీష్, మల్లిరెడ్డి, రొంటాల చిన్నా, కూనా మల్లికార్జున్, సీహెచ్ మురళి పాల్గొన్నారు.

వాణిజ్యాభివృద్ధి దిశగా తిరుపతి రైల్వేస్టేషన్


ప్రీ బిడ్ సమావేశంలో ఆర్‌ఎల్‌డీఏ అధికారులు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : తిరుపతి రైల్వేస్టేషన్ ఇకపై వాణిజ్య అభివృద్ధి దిశగా రూపాంతరం చెందుతుందని రైల్ ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఆర్‌ఎల్‌డీఏ) అధికారులు వెల్లడించారు. బుధవారం తిరుచానూరు రోడ్డులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ప్రీ బిడ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే స్టేషన్‌లో కొత్తగా ఆధునీకరించనున్న భవనంపై దక్షిణ వైపున 36,640 చ.మీ స్థలాన్ని వాణిజ్య అభివృద్ధి కోసం 60 ఏళ్లపాటు లీజుకు ఇచ్చేందుకు టెండర్లను ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ ఆధునికీకరణ ప్రాజెక్టులో భాగంగా సరికొత్త విధానం అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. దీంతో తిరుపతి రైల్వే స్టేషన్‌లో కొత్తగా వాణిజ్య అభివృద్ధిని సులభతరం చేయడానికి ఆస్కారం ఏర్పడిందన్నారు. ఇది బ్రాండెడ్ అవుట్‌లెట్‌లు, ఫుడ్ కోర్టులు, రెస్టారెంట్‌లు, రిటైల్ దుకాణాలు, షోరూమ్‌ల ఏర్పాటుకు వీలు కల్పిస్తుందని వివరించారు. రైల్వే భూమిని ఎలా లీజుకు ఇస్తున్నారో, రైల్వే స్టేషన్‌పై వాణిజ్య ప్రభావం, ఈ టెండర్ విధానం వంటి అంశాలపై ఉదహరిస్తూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇన్వెస్టర్లకు వివరించారు. సమావేశంలో ఆర్‌ఎల్‌డీఏ చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ విష్ణువర్ధన్‌రావు, జేజీఎం శ్రీనివాసరావు, ప్రాజెక్టు మేనేజరు షకీల్ అహ్మద్ పాల్గొన్నారు.

జనసేన కార్యకర్త ఆత్మహత్య

- స్కీమ్‌ల పేరుతో నగదు వసూలు
- పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బలవన్మరణం


అనిల్ (ఫైల్)

కోట : విచారణ పేరుతో పోలీసులు వేధించారని బంధువులకు చెప్పి కోట మండలంలో ఓ జనసేన కార్యకర్త మంగళవారం ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వివరాలు.. మండలంలోని చిట్టేడుకు చెందిన జనసేన కార్యకర్త అనిల్ (35) కొంత కాలంగా స్కీమ్‌ల పేరుతో పలువురు నుంచి సుమారు రూ.10 లక్షల వరకు వసూలు చేశాడు. కాలపరిమితి దాటినా తిరిగి చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ క్రమంలో వారం క్రితం గ్రామానికి చెందిన మంగమ్మ అనే మహిళ తాను చెల్లించిన రూ.10 వేలు తిరిగి ఇవ్వాలని కోరింది. దిక్కున్న చోట చెప్పుకోమని అనిల్ బెదిరించడంతో ఆమె నిద్ర మాత్రలు మింగి ఆస్పత్రి పాలైంది. అనంతరం కోట పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ పవన్‌కుమార్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో అనిల్‌ను ఎస్‌ఐ పిలిపించి మంగళవారం విచారణ చేపట్టారు. ఆ సమయంలో ఆమె వద్ద తాను నగదు తీసుకున్న మాట వాస్తవమేనని అనిల్ ఒప్పుకున్నాడు. దీంతో ఎవరి దగ్గర ఎంత మొత్తంలో నగదు వసూలు చేశావు అనే పూర్తి వివరాలు తీసుకుని రావాలని చెప్పి అనిల్‌ను ఇంటికి పంపివేశారు. ఇంటికి వచ్చిన అనిల్ తన స్నేహితులు, బంధువుల వద్ద కోట ఎస్‌ఐ తనను వేధించాడని వాపోయాడు. గడ్డి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబీకులు తిరుపతిలోని ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తుండగా బుధవారం మృతి చెందాడు. అయితే మృతుడికి గతంలో వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నప్పటికి ఆమెను వదలి వేసి మరో మహిళను పెళ్లి చేసుకున్నాడని , జీవనం కోసం ఇలాంటి స్కీమ్‌లతో నగదు వసూలుకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో అనిల్ కుటుంబ సభ్యులు కోట ఎస్‌ఐపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ విషయమై వాకాడు సీఐ హుసేన్ బాషాను వివరణ కోరగా ఈ కేసును తాను విచారణ చేసి నివేదికలను ఉన్నతాధికారులు అందిస్తామని వెల్లడించారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత

సత్యవేడు: ఎన్‌ఎం కండ్రిగ క్రాస్ నుంచి తమిళనాడుకు ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను ఎస్‌ఐ రామస్వామి సీజ్ చేశారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు పోలీసులు మంగళవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎస్వీ వెటర్నరీలో జాతీయ సదస్సు ప్రారంభం

- 14 రాష్ట్రాల నుంచి హాజరైన 250 మంది పశువైద్య విద్యార్థులు


పశువైద్య చికిత్స, శస్త్రచికిత్సలకు సంబంధించి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ వీసీ తిలగర్, వెటర్నరీ వీసీ జేవీ రమణ, అసోసియేట్ డీన్ జగపతి రామయ్య

చంద్రగిరి: పశుపక్ష్యాదులకు అందించాల్సి మెరుగైన వైద్య సేవలు, శస్త్రచికిత్సల కోసం తిరుపతి ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయంలో జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి తమిళనాడు వెటర్నరీ యూనివర్సిటీ మాజీ వీసీ డాక్టర్ తిలగర్ హాజరవ్వగా, ప్రత్యేక అతిథిగా ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ వీసీ జేవీ రమణ, ప్రొఫెసర్ ప్రతాబన్ పాల్గొన్నారు. ఎస్వీ వెటర్నరీ చికిత్స, టీచింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి 14 రాష్ట్రాల నుంచి 25 పశువైద్య కళాశాలలకు చెందిన 250 పశువైద్య విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ప్రొఫెసర్ తిలగర్ మాట్లాడుతూ.. పశువైద్యంలో స్పెషలైజేషన్ చాలా అవసరమన్నారు. పశువైద్య విద్యార్థులు స్కిల్‌తో పాటు ఆధునిక టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వీసీ జేవీ రమణ మాట్లాడుతూ.. పశువుల్లో వచ్చే వ్యాధుల నివారణకు ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ పాత్ర చాలా ఉందని తెలిపారు. ప్రొఫెసర్ ప్రతాబన్ మాట్లాడుతూ.. శస్త్ర చికిత్స విభాగం, డయాగ్నోసిస్ విభాగం ప్రాముఖ్యత, వ్యాధి నిర్ధారణ విభాగాల పాత్ర చాలా అవసరమన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ వి. వైకుంఠరావు, పశు వైద్య కళాశాల, తిరుపతి అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ పి.జగపతి రామయ్య తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా ప్రొఫెసర్ వీరబ్రహ్మయ్య వ్యవహరించారు. అనంతరం పశువైద్య, శస్త్రచికిత్సలకు సంబంధించిన బుక్‌లెట్‌లను ఆవిష్కరించారు.